క్లుప్తంగా

దర్గా పక్కగా రోడ్డు వేయండి



మంగళగిరి: నగర పరధిలోని నవులూరు గ్రామంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో వేయనున్న రోడ్డు మసీదు మధ్య నుంచి వెళ్తోందని, మసీదును తప్పించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులను స్థానిక ముస్లింలు గురువారం కోరారు. రోడ్డు పరిశీలించేందుకు వచ్చిన సీఆర్డీఏ డిప్యూటీ కమిషనర్ శంకరరావును హజరత్ మలక్ హుస్సేన్ అవులియా బాబా దర్గా ట్రస్టీ మహ్మద్ ఉస్మాన్ షరీఫ్, బాబా భక్తులు, స్థానికులు కలిసి వినతిపత్రం అందజేశారు. దర్గాను తొలగించకుండా దక్షిణం వైపునకు రోడ్డు మళ్లించాలని కోరారు.

93వ రోజు కార్మికుల దీక్ష



తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష గురువారానికి 93వ రోజుకు చేరింది. సీఐటీయూ నాయకులు దీక్షా శిబిరాన్ని సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంను ఒప్పించి కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, దుర్గారావు, కూరపాటి స్టీవెన్, కార్మికులు ఆశీర్వాదం, గురవయ్య, దుర్గా భవాని, సారమ్మ, ఇమాంబి, రహమతుల్లా పాల్గొన్నారు.

ఎంపీ ఆళ్లకు సన్మానం



తాడేపల్లిరూరల్: రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డిని తాడేపల్లి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ వైఎస్సార్ కేవీఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కళ్ల రాజాకు కేంద్ర టెలికమ్యూనికేషన్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించిన ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాజాను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, నియోజకవర్గ రైతు సంఘం నాయకుడు రుక్మాంగరెడ్డి, చిలుకోటి శ్రీనివాస్ మధు, మున్నంగి వివేకానంద రెడ్డి, పమిడిమళ్ల వెంకటరామిరెడ్డి, గాంధీ, వికాస్, భూపతి కిషోర్, దానియేల్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మేక వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నాకే ఎందుకిలా.. ఉరేసుకున్న యువకుడు

ఫిరంగిపురం: మానసిక క్షోభతో ఓ యువకుడు ఉరివేసుకొని మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అల్లంవారిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎన్.ఏసురత్నం (21)కు రెండేళ్ల కిందట ఫిరంగిపురానికి చెందిన పూర్ణిమతో వివాహమైంది. ఆమెకు పెళ్లికి ముందు నుంచే ఫిట్స్ ఉంది. అనారోగ్యంతో ఆమె రెండు నెలలకే ఆమె పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి ఏసురత్నం తన జీవితంలోనే ఇలా ఎందుకైందని మానసికంగా కృంగిపోయాడు. బుధవారం సాయంత్రం తన ఇంటిలోని ఇనుప పైపునకు చీరతో ఉరివేసుకొని మృతి చెందాడు. తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తోడికోడలని ఆశ్రయమిస్తే..తరిమేశారు



తాడేపల్లిరూరల్ : తనకు, భర్తకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలంటూ గురువారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మీడియా ముందు ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం రాధారంగా నగర్‌కు చెందిన కామినేని మౌనిక, కామినేని అరుణ కుమారి తమకు రక్షణ కల్పించాలని తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ తోడికోడలని ఆశ్రయం ఇస్తే తమను ఇంట్లో నుంచి తరిమివేశారని చెప్పారు. ఇప్పుడు తమను చంపాలని ప్రయత్నిస్తున్నారని చెప్పారు. వారి నుంచి తప్పించుకుని పారిపోయామని, ప్రాణ రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించామని తెలిపారు.

మొహమాటానికి పోతే.. మొండి బకాయిలు మిగిలాయి

- ఎంటీఎంసీకి ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- రూ.3.5 కోట్ల మేర పేరుకుపోయిన బకాయిలు
- ఏళ్లుగా పట్టించుకోని ఆయా శాఖల అధికారులు
- నిక్కచ్చిగా లేక ఆదాయాన్ని కోల్పోతున్న నగరపాలక సంస్థ
- వసూళ్లలో మొహమాటానికి పోతున్న కార్పొరేషన్ అధికారులు



మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం

మంగళగిరి టౌన్ : ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన చర, స్థిరాలస్తులకు సంబంధించి నగరపాలక సంస్థకు ఆస్తి విలువను బట్టి, పన్ను చెల్లించాలని నిబంధనలు చెబుతున్నాయి. ఎంటీఎంసీ పరిధిలో ఉన్న బీఎస్ఎన్ఎల్, సబ్ రిజిస్ట్రార్, విద్యుత్ శాఖ, వ్యవసాయ మార్కెట్ కమిటీ, ప్రభుత్వ ఆసుపత్రులు, అగ్నిమాపక కేంద్రం, పలు ప్రభుత్వ భవనాలకు ఆస్తి పన్నును సంబంధిత అధికారులు చెల్లించాల్సి ఉంది. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని మంగళరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్‌లో పదుల సంఖ్యలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఆస్తి పన్ను చెల్లించాలని ప్రభుత్వ కార్యాలయాలకు పలు మార్లు కార్పొరేషన్ నోటీసులు జారీ చేసినా ఎలాంటి స్పందన ఉండటం లేదు. పన్ను వసూళ్లలో అధికారులు నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం, ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఉన్న మొహమాటంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. దీంతో నగర పాలక సంస్థ అభివృద్ధి నిలిచిపోతోంది. మంగళగిరి పరిధిలో వివిధ శాఖల కార్యాలయాల నుంచి పన్ను బకాయి రూ.1,88,15,294 వరకు పేరుకుపోయింది. తాడేపల్లి మండల పరిధిలో రూ.1,60,27,545 బకాయిలు వసూలు చేయాలి. ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ ఖజానాకు ఆస్తి పన్నును చెల్లించాల్సి ఉంది.

పలు ప్రభుత్వ కార్యాలయాల బకాయిల వివరాలు .....

ఇవే కాకుండా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలైన పోస్టాఫీస్, రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ కార్యాలయాలు ఆస్తి పన్ను ఎంటీఎంసీకి చెల్లించాల్సి ఉంది. మంగళగిరి పరిధిలోని పోస్టాఫీస్ నుంచి రూ.50,32,752లు బకాయి ఉండగా, రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ కార్యాలయం నుంచి రూ.82,137 చెల్లించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి మొత్తంగా సుమారు రూ.4 కోట్ల వరకు నగరపాలక సంస్థకు ప్రాపర్టీ టాక్స్ రూపంలో రావాల్సి ఉంది.

ఆస్తి పన్ను బకాయి మంగళగిరిలో	
పట్టణ పోలీస్‌స్టేషన్ :	రూ. 23,57,704
తహసీల్దార్ కార్యాలయం:	రూ.23,34,484
పంచాయతీరాజ్ ఉపకార్యపాలక ఇంజనీరింగ్ కార్యాలయం:	రూ. 21,32,664
రూరల్ పోలీస్‌స్టేషన్	రూ.19,78,739
మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్:	రూ.12,54,201
సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం:	రూ.4,00,032
తాడేపల్లి పరిధిలో	
పిడబ్ల్యూడీ వర్క్‌షాప్ డివిజన్ కార్యాలయం:	రూ.58,09,971
శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం కార్యాలయం	:రూ. 66,73,617
బోటు యార్డు :	రూ.8,49,283
తహసీల్దార్ కార్యాలయం:	రూ.8,88,771
ఎంపీడీఓ కార్యాలయం:	రూ.5,86,997
పోలీస్ క్వార్టర్స్ :	రూ. 3,24,122
తాడేపల్లి పోలీస్‌స్టేషన్:	రూ.2,97,239

కేఎల్‌యూలో అమెరికా యూనివర్శిటీ ప్రతినిధులు



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీని అమెరికాకు చెందిన వేయిన్ స్టేట్ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం గురువారం సందర్శించింది. అంతర్జాతీయ సంబంధాల డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ వేయిన్ స్టేట్ యూనివర్శిటీ మెకానికల్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ నబిల్ చలోబ్, సివిల్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ లీలా మోహన్‌రెడ్డి బృంద సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. వివిధ పరిశోధనాంశాల్లో పరస్పర సహకారానికి ఒప్పందానికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు అమెరికాలోని యూనివర్శిటీలో మిగిలిన విద్యను కొనసాగించవచ్చని వెల్లడించారు. అలాగే అక్కడి విద్యార్థులు కూడా కేఎల్‌యూలో విద్యను కొనసాగించవచ్చని వివరించారు. రాబోయే సెమిస్టర్ నుంచి ఇది అమలులోకి వచ్చేలా ఒప్పందపు నమూనాపై ఇరు పక్షాలు అంగీకరించాయని కిషోర్‌బాబు తెలిపారు. కేఎల్‌యూ ఆర్ అండ్ డీ అదనపు డీన్ డాక్టర్ బీటీపీ మాధవ్, విభాగాధిపతి పతులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ పోలురాజు, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్ విజయ మారుతి, అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ గోపీకృష్ణ పాల్గొన్నారు.

హోదాలు మరిచి..పాదాలు కదిపి



చదరంగం పర్యవేక్షిస్తున్న అడిషనల్ కమిషనర్ శకుంతల



కబడ్డీ ఆటలో చురుగ్గా కూత పెడుతూ..



ఓర్పుతో.. షార్పుగా లెమెన్ అండ్ స్పూన్

ఉత్సాహంగా మహిళా ఉద్యోగుల ఆటల పోటీలు

మంగళగిరి టౌన్ : వారందరూ హోదాలు మరిచారు.. పాదాలు కదిపారు.. ఆటలు ఆడారు.. చిన్నపిల్లల మాదిరి పోటీపడ్డారు. గెలుపుకోసం సర్వశక్తులు ఒడ్డారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే మహిళా ఉద్యోగులు ఆటపాటల్లో పాల్గొని సందడి చేశారు. ఉత్సాహంగా ఉల్లాసంగా ఆటలు ఆడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. సచివాలయ, నగరపాలక సంస్థ, వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్, కబడ్డీ, చెస్, స్కిప్పింగ్ తదితర ఆటల్లో పోటీపడ్డారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నారు. ఈ ఆటపోటీలను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, అడిషనల్ కమిషనర్ శకుంతల ప్రారంభించారు. సుమారు 100 మందికి పైగా మహిళా ఉద్యోగులు పాల్గొన్నారని అడిషనల్ కమిషనర్ తెలిపారు.

రజక కమ్యూనిటీ హాల్‌ను త్వరలో పూర్తిచేస్తాం



కమిషనర్‌తో మాట్లాడుతున్న రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కొత్తూరులో అసంపూర్తిగా ఉన్న చాకలి ఐలమ్మ రజక కమ్యూనిటీ హాల్‌ను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, మంత్రి నారా లోకేష్ సెక్రటరీ అరుణ్ బాబుతో కలసి గురువారం సందర్శించారు. వీలైనంత త్వరలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని రజక వృత్తిదారులు సంఘం నాయకులు కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ త్వరలోనే కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. భాస్కరయ్య, రాష్ట్ర కోశాధికారి వల్లభాపురం వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు, నాయకులు టి. సాంబశివరావు, కె.వీరాంజనేయులు, యు.దుర్గారావు, నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

23న రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఎన్నికలు



సమావేశంలో మాట్లాడుతున్న కె. గోవిందరావు

మంగళగిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నికోవడానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఏపీ మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర హడ్ కమిటీ కో ఆర్డినేటర్ కె. గోవిందరావు తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 23న ఎన్నికలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. 120 సంఘాల మద్దతుతో ఒక రాష్ట్రం ఒకటే అసోసియేషన్ అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం ఏర్పడిందని అన్నారు. ఈ సంఘం రాష్ట్రంలో వున్న 1.15 లక్షల మంది మాజీ సైనికులు, సైనిక వితంతువుల సమస్యల కోసం పనిచేసేందుకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంగళగిరి వెటరన్ ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ సాంబశివరావు, జనరల్ సెక్రటరి బాలస్వామి, ట్రెజరర్ సాంబశివరావు పాల్గొన్నారు.

డ్రోన్ తనిఖీలు

- అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి
- ఏకాంతంగా మాట్లాడుకుంటున్న ప్రేమికులు
- తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



డ్రోన్ ద్వారా ఇసుక తిన్నెల్లోని జంటలను గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు డ్రోన్ సహాయంతో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగా తాడేపల్లి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో డ్రోన్ ఎగుర వేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఇసుక తిన్నెల్లో ఏకాంతంగా మాట్లాడుకుంటున్న ప్రేమికులను గుర్తించారు. వెంటనే ఘటనా స్థలానికి తాడేపల్లి సీఐ కల్యాణరాజు తన సిబ్బందితో చేరుకుని, తమదైన శైలిలో ప్రేమ జంటకు కౌన్సిలింగ్ నిర్వహించి అక్కడి నుండి పంపించి వేశారు. ఈ సందర్భంగా సీఐ కల్యాణరాజు మాట్లాడుతూ తాడేపల్లి ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి పెట్టామన్నారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్ స్నాచింగ్ నేరాలను ఛేదించేందుకు పోలీస్ యంత్రాంగం డ్రోన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతంతో పాటు పలు ప్రాంతాల్లోని పాడుబడిన బంగ్లాలు, నివాస గృహాలపై కూడా డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంగళగిరిలో..

మంగళగిరి: నగర పరిధిలోని బహిరంగ ప్రదేశాలు, సీఆర్డీఏ భూముల్లో అసాంఘిక కార్యక్రమాలపై స్థానిక పోలీసులు దృష్టి సారించారు. డ్రోన్‌లు వినియోగించి అడ్డుకట్టవేస్తున్నారు. రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ మాములుగా నిఘా ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న ప్రదేశాలకు వెళ్లేసరికి సమాచారం అందుకుని పారిపోతున్నారని తెలిపారు. పోలీసులు వస్తారని అసాంఘిక శక్తులు సైతం నిఘా ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలిపారు. డ్రోన్ నిఘాలతో వారి ఆటలు కట్టించి, స్టేషన్ పరిధిలో పూర్తిగా అసాంఘిక కార్యక్రమాలు అరికట్టడమే లక్ష్యమని తెలిపారు.

రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9న ఆదివారం జరిగే రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి బైపాస్‌లో ఉన్న ఆర్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో రాష్ట్ర మహిళా సంఘం కార్యవర్గ నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, 6వ బెటాలియన్ ఐజీ రాజకుమారి హాజరుకానున్నట్లు చెప్పారు. మహిళలందరూ అధిక సంఖ్యలో హాజరై ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు



తెనాలి అర్బన్: రోడ్లపై చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. చెంచుపేటలో గురువారం ఉదయం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతుబజార్ వద్ద వ్యర్థాలను కార్మికులకు అప్పగించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం బస్టాండ్ సమీపంలోని అన్న క్యాంటీన్‌కు వెళ్లి అల్పాహారాన్ని పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు చినరావూరులో పర్యటించారు. కొందరు అనధికారికంగా రోడ్లపై నిర్మాణాలు చేయడాన్ని గమనించిన ఆయన వాటిని తొలగించాలని ఆదేశించారు. అధికారుల వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కలెక్టర్ నాగలక్ష్మి విస్తృత పర్యటన



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మేడికొండూరు : నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం భూములను, భూ యజమానుల సమక్షంలో రీ సర్వే సక్రమంగా నిర్వహించేందుకు సర్వే అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టర్ నాగలక్ష్మి సిరిపురం గ్రామంలో పర్యటించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఇంటర్మీడియట్ పరీక్షల విధానాన్ని పరిశీలించారు. పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మందపాడు గ్రామంలో పంట పొలాల రీసర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూముల క్లాసిఫికేషన్‌లో యజమానుల పేర్లు అక్షర దోషాలు లేకుండా, తప్పులకు అవకాశం లేకుండా నమోదు చేసేందుకు జాగ్రత్త వహించాలన్నారు. వీఆర్వో లాగిన్ స్థాయిలోని అన్ని వివరాలు రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. గ్రామంలో దేవాదాయ శాఖకు సంబంధించి భూముల్లో నివాస స్థలాలు ఉన్న ప్రాంతం మినహా.. మిగతా ప్రాంతం ఆక్రమణలు జరగకుండా దేవదాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం దేవాదాయ శాఖ స్థలంలో ఉంటున్న నివాసితుల రికార్డులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్డీఓ శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనులను పరిశీలించిన కమిషనర్



కార్మికులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణంలో పారిశుద్ధ్య పనులను ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికుల హాజరు శాతాన్ని పరిశీలించి, ప్రతి ఒక్కరు సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం ఒకటవ వార్డులోని పాత విజిటబుల్ మార్కెట్‌ను పరిశీలించారు. బోసుబొమ్మ సెంటర్ వద్ద మసీదు సమీపం నుంచి బకింగ్ హామ్ కెనాల్‌లో కలిసే డ్రెయినేజీని పరిశీలించి, దాని నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ రాము, ఏఈలు అనూష, పవన్, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో బాలికకు గాయాలు



బాలికపై దాడిచేస్తున్న శునకం

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాల చెరువులోని ఆరేళ్ల బాలికపై గురువారం కుక్క దాడి చేసి, గాయపరిచింది. రత్నాల చెరువు దగ్గర నివాసముంటున్న వంకల సతీష్ కుమార్తె భవాని ఆడుకోవడానికి బయటకు వచ్చింది. అప్పుడే కుక్క అకస్మాత్తుగా బాలికపై దాడి చేసింది. స్థానిక మహిళలు కేకలు వేయడంతో పాపను వదిలివేసి కుక్క పారిపోయింది. గాయపడిన పాపను ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించారు. రత్నాల చెరువు ప్రాంతమే కాకుండా మంగళగిరి నగర పరిధిలో ప్రతి వీధిలో కుక్కల సంచారం ఎక్కువగా ఉందని, ప్రతిరోజు కుక్కకాటు బారిన పడిన వాళ్లు పదుల సంఖ్యలో ఆసుపత్రుల పాలతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుకుంటున్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

దుగ్గిరాల: శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ద్వితీయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్థానిక పసుపు మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న దేవస్థానంలో ఈ నెల 11వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు సుప్రభాత సేవ, ధ్వజారోహణ, నిత్య కైంకర్యాలు, గోపూజ, నిత్య హోమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. 10న స్వామివారి గ్రామోత్సవం, 11న చక్రస్నానం, నిత్యహోమం జరుగుతుందని, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం ధ్వజారోహణం, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఎడ్ల బల ప్రదర్శనకు ఏర్పాట్లు

తెనాలి రూరల్: ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెనాలి మార్కెట్ యార్డు ఆవరణలో జరగనున్న జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీల ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలపాటి శివరామ కృష్ణయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారథ్యంలో జరగనున్న ఈ పోటీలకు సంబంధించి గురువారం భూమి పూజ నిర్వహించారు. వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. టీడీపీ నాయకులు పనులను పర్యవేక్షిస్తున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరి ప్రసాద్, మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, రావి చిన్ని, సుంకర హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి



దుగ్గిరాల: మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో హౌసింగ్ అసిస్టెంట్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హౌసింగ్ ఏఈ జీవీ సుబ్బారావు అధ్యక్షత వహించి, మాట్లాడారు. పీఎంఏవై 2.0 యూడీఏ పథకానికి అర్హులు ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీలోపు నమోదు చేయించువాలని తెలిపారు. 420 చదరపు అడుగులు కలిగిన వారికి రూ.2,50,000, 265 చదరపు అడుగులు కలిగిన వారికి రూ.1,80,000లు మంజూరు చేస్తామని చెప్పారు. ఇది వరకు మంజూరయ్యి, నిర్మాణం పూర్తిగాని ఎస్సీ, బీసీలకు లబ్ధిదారులకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇస్తారని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ సాయికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోలి మధు, కొండలరావు, అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.